# తిరిగి తిరిగి తలెత్తే ప్రశ్నలు

చర్చ

సుధాకిరణ్

## 'నక్సలైటు ఉద్యమం వెలుగు నీడలు' బాలగోపాల్ వ్యాసాలు-ఒక పరామర్శ

***ఈ వ్యాసంలో రచయిత వెలిబుచ్చిన అభిప్రాయాలపై చర్చను ఆహ్వానిస్తున్నాము - సంపాదకుడు***

*'గురిచూసే పక్షి కన్ను గురించి*
*గురి తప్పని వీరుల గురించి*
*విల్లంబులెక్కుపెట్టిన విలుకాళ్ళ గురించి*
*బిగిసి నిలబడడం గురించి*
*బారులు తీరి కవాతు చేయడం గురించి*
*వడ్డీతో చెల్లించే నెత్తుటి బాకీ గురించి*
*ఎలాగూ మాట్లాడుకుంటాం'*

*'గురిలోకి రాని ఆకాశంలో*
*దోగాడే మేఘాల గురించి*
*చెట్టుకొమ్మల్లో కనిపించని*
*చెదిరిన గూడు గురించి*
*నీడలో రాలి నలిగిపోయిన ఆకుల గురించి*
*చిగురించిన వసంతంలో*
*వికసించని విలపించే పువ్వుల గురించి*
*రెక్కలు విరిగి నేలకూలిన పక్షుల గురించి*
*దాటివచ్చిన దారిలో కూలిన వంతెనల గురించి*
*ఎప్పటికైనా మాట్లాడుకోవాలి'*

**ఒక నాయకుని అంతర్మథనం:**

జులై 26, 1958. కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురానికి సమీపంలోని కొల్లం పట్టణం పక్కనే వున్న చందన తోపులో పోరాడుతున్న జీడిమామిడి ఫ్యాక్టరీ కార్మికుల పైకి పోలీసులు కాల్పులు జరిపారు. కేరళ రాష్ట్రంలో అప్పుడే కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారు. కాల్పులలో ముగ్గురు చనిపోయారు. కాల్పుల సమాచారం అందే సమయానికి కమ్యూనిస్టుపార్టీ రాష్ట్రకమిటీ సమావేశం జరుగుతూ వుంది. ఆనాటి కేరళ కమ్యూనిస్టుపార్టీ నాయకులలో ఒకరైన దామోదరన్ మాటల్లో, 'కామ్రేడ్స్ అందరి తక్షణ ప్రతిస్పందన ఇలా వుంది, కాల్పులని ఖండించాలి, తక్షణ విచారణకి ఆదేశించాలి, మృతులకుటుంబాలకి సంతాపం తెలియజేయాలి, కార్మికులకి బహిరంగ క్షమాపణ తెలియజేసి, మనం అధికారంలో వున్నంతవరకు ఇలాంటి ఘటనలు పునరావృతం కావని హామీ ఇవ్వాలి'. పార్టీకి వ్యతిరేకులు (రోమన్ కాథలిక్ పూజారులు, నాయర్ కులతత్వ వాదులు, అతి, మితవాద సోషల్ డెమోక్రాట్లు) అంతా కట్టగట్టుకుని పార్టీతో తలపడుతున్న సమయంలో, అధికారంలో వున్న మనమే పోలీసులని ఖండిస్తే, వాళ్ళ నైతిక స్థైర్యం దెబ్బతింటుంది గదా అన్న చర్చ మొదలైంది. అందుకని పోలీసుల చర్యని సమర్ధించాలన్న నిర్ణయం తీసుకుని, దామోదరన్ ఆ నిర్ణయాన్ని పార్టీ తరపున సమర్ధిస్తూ మాట్లాడాలని రాష్ట్రకమిటీ ఆదేశించింది. 'నేను ముగ్గురు కార్మికుల మరణానికి, ఆర్ఎస్పి బాధ్యతా రాహిత్యాన్ని నిందించేను. వాళ్ళు కార్మికులని కాల్పులు జరిగేదాకా ఎందుకు తీసుకెళ్ళారో చెప్పాలని అడిగేను. సమ్మె నాయకులని తీవ్రంగా దూషించేను. ఆ రాత్రి ఇంటికి చేరిన తర్వాత, నాకు లోలోపల చాలా బాధవేసింది. నిద్ర పట్టలేదు. పార్టీ నిర్ణయాన్ని సమర్ధించకుండా, తిరస్కరించి వుండాల్సింద నిపించింది. పిచ్చెక్కిపోతుందేమోననిపించింది. కోపంతో నా భార్యని అరిచేను. నన్ను ఆ స్థితిలోకి నెట్టిన పార్టీ నాయకులని నిందించకుండా, నా భార్యపైన ఆ కోపాన్ని చూపించాను. ఆ మరునాడు, నేను మరో మూడు సభలలో అదేవిధంగా మాట్లాడాలని అడిగేరు. ఈసారి, అందుకు నేను సూటిగా నిరాకరించాను. పార్టీ అందుకు సమ్మతించింది'.[1]

**ఇద్దరు రచయితల సంవాదం:**

1975 వసంతకాలపు తొలి రోజులవి. హాంబర్గ్ సమీపంలో ప్రఖ్యాత జర్మన్ రచయిత గుంటర్‌గ్రాస్ నివాసం. ఉమ్మడి మిత్రుడొకరు, ప్రవాసంలో వున్న చిలీ రచయిత ఎరియల్ డార్ఫ్ మన్, గుంటర్ గ్రాస్‌ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పుస్తకాల గురించీ, రచనల గురించీ సంభాషణలన్నీ ఆత్మీయంగా సాగుతున్నాయి. 'ప్రాగ్ వసంతం'గా పిలిచే చెక్ దేశపు ప్రతిఘటనకి మద్దతుగా దక్షిణ ఫ్రాన్స్‌లో జరిగిన సదస్సు ప్రస్తావన సంభాషణలలో వచ్చింది. చిలీ సోషలిస్టులు అందుకు హాజరు కావడానికి

నిరాకరించేరు. 'ప్రాగ్ వసంతమూ, చిలీ విప్లవమూ సోవియట్ సామ్రాజ్యవాదం, అమెరికాలవంటి ఒకే తరహా శక్తుల చేతుల్లో అణచివేతకి గురయ్యాయని వాళ్లకి అర్థంకావడం లేదా?' అని గుంటర్ గ్రాస్, ఎరియల్ డార్ఫ్ మన్‌ని అడిగేరు. దీంతో సంభాషణ మలుపు తిరిగింది. తమకి మద్దతు తెలుపుతున్న సోవియట్ మిత్రులని చిలీ సోషలిస్టులు బహిరంగంగా వ్యతిరేకించలేరన్న జవాబుతో ఇక ఆ సమావేశం ముగిసిపోయింది. భోజనంచేసి, ఎరియల్ డార్ఫ్ మన్, ఆయన మిత్రులు వెనక్కి బయలుదేరే వరకూ, గుంటర్ గ్రాస్ నోరు తెరిచి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వీడ్కోలు పలికే ముందు, ఎరియల్ డార్ఫ్ మన్ వైపు చూస్తూ, 'ఒక వైఖరి నైతికంగా సరైనది అనుకున్నప్పుడు, వ్యక్తిగత, రాజకీయ పర్యవసానాలతో పట్టింపు లేకుండా, ఆ వైఖరిని సమర్థించాల్సిందే'నని గుంటర్ గ్రాస్ అన్నారు. ఆ తర్వాత ఎరియల్ డార్ఫ్ మన్ రాసిన మాటలు: 'రాజకీయ వ్యవహారవాదానికి లోబడి పోవడమేగాక, మార్క్సిజంతో స్ఫూర్తిపొందామని చెప్పుకుంటున్న పాలకుల దుశ్చర్యలని చూడ నిరాకరించానన్న విషయాన్ని గుంటర్ గ్రాస్‌కి చెప్పలేకపోయాను. బహుశా, దాన్ని అంగీకరించడానికి నేనే సిద్ధంగా లేనేమో'. [2]

**ఒక కవి ఆత్మహత్య:**

మే 19, 1991. తమిళ కవి శివరమణి ఆత్మహత్యకి పాల్పడ్డారు. చనిపోయేనాటికి ఆమె వయసు ఇరవై నాలుగేళ్ళే. అప్పటి ఈలం కవులలో తనది బలమైన గొంతు. తనతోపాటు, తన సహ రచయితల స్వేచ్ఛపై ఎల్.టి.టి.యి. ఆంక్షలకి నిరసనగా తాను ఆత్మహత్యకి పాల్పడేముందు, ఆమె తన కవితలన్నిటినీ తగులబెట్టేశారు.

*'నా కాలాన్ని*
*నా నుంచి మీరు లాగేసుకోలేరు*
*మీ కళ్ళని కప్పివేస్తున్న*
*మీ చేతివేళ్ల సందుల్లోంచి*
*దిగివచ్చే చిరు నక్షత్రంలా*
*నేను కొనసాగుతాను'*

ఇవీ, ఆమె చివరి వాక్యాలు. **పిల్లలు** అన్న శివరమణి కవిత, అప్పటి పరిస్థితులకీ, ఆమె భావాలకీ అద్దంపడుతుంది.

*'సమూహపు తల్లిపేగుపైకి*
*తుపాకీ ఎక్కుపెట్టినపుడు*
*సున్నితమైన పూల మొగ్గలపైన*
*నిలబడే సీతాకోకచిలుక కలలు*
*నాకు అర్థం కావు*
*మనిషిగా నేను నిలబడడానికి*
*పూలని చెట్టుకే వదిలివేస్తాను'*

ఎంతో ముందుచూపుతో తమిళ కవి చేరన్ రాసిన ఈ క్రింది కవిత పంక్తులు, 2009 తదనంతర పరిణామాలకి సూచిక అని చెప్పుకోవచ్చు.

*'తన రచనలకి అగ్నికి ఆహుతిచేసే*
*అవకాశం కాఫ్కాకి రాలేదు*
*శివరమణి మాత్రం తన కవితలని*
*దగ్ధంచేసింది*
*స్వేచ్ఛ లేనిచోట ఒక కవిత*
*ధ్వంసమై పోయింది*
*ఇతరులు రాసిన కవితలు*
*రెక్కలు తొడగడం లేదు*

*అందరమూ తరలిపోయాం*
*కథలు చెప్పేందుకు ఎవరూ మిగలలేదు*
*ఇప్పుడు*
*ఒక గాయపడిన భూ శకలం*
*ఏ పక్షీ ఎగరలేకపోతోంది*
*మనం తిరిగి వచ్చేదాకా'* [3]

1950లు, 70లు, 90లలో వివిధ నేపథ్యాలలో (కేరళ, చిలీ/యూరప్, శ్రీలంక), విభిన్న రాజకీయ సన్నివేశాలలో ఉద్యమాలు, ఉద్యమాలతో అనుబంధాన్ని పంచుకున్న వ్యక్తుల అనుభవాలలో పోలికలని పైన మనం గమనించవచ్చు. **'నక్సలైటు ఉద్యమం వెలుగు నీడలు'** సంకలనంలో కూర్చిన బాలగోపాల్ వ్యాసాలని (పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ, మే 2017) మళ్ళీ ఒకసారి

చదువుతూ వుంటే పైన పేర్కొన్న ఘటనలు గుర్తుకొచ్చాయి. పై అనుభవాలు, అవి లేవనెత్తే ప్రశ్నలమధ్య సామ్యం గురించి ఆలోచించవలసి వుంటుందనిపించింది.

**మారిన అంచనాలు, మారిన పరిస్థితులు**

'నక్సలైటు ఉద్యమం'గా పిలిచే సాయుధ రాజకీయ ఉద్యమంపై బాలగోపాల్ అంచనాలు, విమర్శలు, విశ్లేషణలు ఈ వ్యాసాల సంకలనంలో కనిపిస్తాయి. 1990 నుంచి మొదలుపెట్టి 2009 మధ్యకాలంలో, వివిధ (తెలుగు) దినపత్రికలలో రాసిన 40 వ్యాసాలు(ఒక ప్రసంగపాఠం, రెండు ఇంటర్వ్యూలతో కలిపి) ఈ సంకలనంలో వున్నాయి. 1990 నుంచి మొదలుపెట్టినా, ఇందులో, 1997, ఆ తర్వాత రాసిన వ్యాసాలదే (38 వ్యాసాలు) ప్రధానభాగం. బాలగోపాల్ 1990ల ప్రారంభంలో రాసిన వ్యాసాలలో అంచనాలకీ, 1995 తర్వాత కాలంలో అంచనాలకీ స్పష్టమైన తేడా వుంది. బాలగోపాల్ (సైద్ధాంతిక) అభిప్రాయాలలో వచ్చిన మార్పు కీలకమైనదే అయినప్పటికీ, ఈ తేడాని కేవలం ఆయన అభిప్రాయాలలో వచ్చిన మార్పు ఫలితంగా మాత్రమే చూడడం పొరపాటు అవుతుంది. ఈ తేడాని, వస్తుగత పరిస్థితులలో వచ్చిన మార్పుల రీత్యా కూడా చూడాల్సి వుంటుంది.

**కల్లోల కాలం:**

1990లలో అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ, (ఆనాటి ఉమ్మడి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ రాజకీయ, సామాజిక మార్పులతోపాటు, నక్సలైటు ఉద్యమ స్వభావం లోనూ గణనీయమైన మార్పులు వచ్చేయి. తూర్పు యూరప్ దేశాలలో 'కమ్యూనిస్టు రాజ్యాలు'గా పిలిచే వాటి పతనంకాగా, వివిధ దేశాలలో ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకుల ప్రోద్బలంతో 'నూతన ఆర్థిక విధానాల' అమలు ముమ్మరమైంది. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయంలేని చరిత్ర అంతం గురించి ప్రకటనలు ప్రాచుర్యంలోకి రాగా, సోషలిజం భవిష్యత్తు గురించి ప్రశ్నలూ తలెత్త సాగేయి. మరోవైపు, ఎమర్జెన్సీ అనంతరకాలంలో ఉత్తర తెలంగాణా ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటాలపై నిర్బంధం తీవ్రం కావడంతో, వాటికి నాయకత్వం వహించిన నక్సలైటు [సిపిఐ (ఎం-ఎల్)] గ్రూపుల రాజకీయ, నిర్మాణ వైఖరులలో, విధానాలలో మార్పులు వచ్చేయి. పైన నాయకత్వ వైఖరులతోపాటు, క్రింది శ్రేణుల లోనూ, వాళ్ళు ప్రజలతో, ఇతర సంస్థలతో వ్యవహరించే తీరులోనూ మార్పులు రావడం మొదలైంది. 1990లలో ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో వివిధ సిపిఐ(ఎం-ఎల్) గ్రూపుల మధ్య దాడులు, ఘర్షణలలో సైతం దాదాపు వందమంది చనిపోయారు.

ఈ మార్పులు, పరిణామాలు ఉద్యమాలకి వివిధ స్థాయిలలో మద్దతుగా నిలిచిన శ్రేణులని సైతం కలవర పరిచేయి. పలు సందేహాలకీ, విమర్శలకీ దారితీసేయి. ఈ సంకలనంలో బాలగోపాల్ వ్యాసాలని వస్తుగత పరిస్థితులలో వచ్చిన మార్పుల నేపథ్యంలో కూడా పరిశీలించాలి.

1. 1990ల ప్రారంభంలో తెలంగాణా ప్రాంతంలో ఒక పెద్ద ప్రజా కదలిక వచ్చినా, వివిధ కారణాలతో అది వెనక్కిపోయింది. ఈ సంకలనంలోని మొదటి రెండు వ్యాసాలూ, ఆనాటి పరిస్థితులకి అద్దంపడతాయి. 'భూమి విషయంలో వర్గ దృక్పథం ఏర్పడినంత సులభంగా ఇతర విషయాలలో ఏర్పడదు. నేరము, శిక్ష, కుటుంబ సంబంధాలు, లైంగికనీతి, ప్రజల మధ్య వైరుధ్యాలు – అన్ని విషయాలలోనూ సరయిన ప్రజాస్వామిక దృక్పథం ఏర్పడటం అనేది కొంత ప్రయాసమీద జరుగుతుందిగానీ తనంతట తాను జరగదు...జీవిత అనుభవంతో కొన్ని విలువలను తిరస్కరించినా మిగిలినవి పోవడానికి చాలా పోరాట అనుభవం, రాజకీయ పరిణితి అవసరం అవుతాయి... ప్రజా కోర్టుల లోని నేర విచారణ పద్ధతులు, అక్కడ వాళ్ళు వేసే శిక్షలు, భూస్వాముల పంచాయితీల నమూనాలో ఉన్నాయని కొన్ని ప్రాంతాలనుండి వస్తూన్న విమర్శను ఈ దృష్టితో సీరియస్‌గా పరిగణించి సవరించుకోవడం తప్పనిసరి కర్తవ్యం'. (వ్యాసం1-'తిరిగి తిరిగొచ్చింది'). ఈ క్రమంలో రెండు అంశాలు ముందుకొచ్చాయి. ఒకవైపు, ప్రజాస్వామిక దృక్పథం నెలకొల్పేందుకు అంతర్గతంగా జరుగుతున్న ప్రయాసపట్ల, రాజకీయ పరిణితిని పెంపొందించడంకోసం చేసే ప్రయత్నాలపట్ల సందేహాలు పెరిగి పోయాయి. రెండోవైపు 'తొందరపాటు చర్యలు, పరిష్కారాలు, తప్పుల పైన' తప్పని సరిగా వచ్చే విమర్శలని అసహనంతో చూడడం పెరిగి పోయింది. అనుమానపు అగాధాలు పెరిగిపోగా, అసహనపు జడిలో వంతెనలు కూలిన కాలమది.

2. 1990లు ప్రజాస్వామిక ఉద్యమాల పరిధిని విస్తృతంచేసే ప్రశ్నలని ముందుకు తెచ్చాయి. స్త్రీల సమస్య, దళిత సమస్య, అందులోనూ అణగారిన కులాల సమస్య (ఉదా: మాదిగ రిజర్వేషన్లు), ప్రత్యేక తెలంగాణ సమస్య, ఆదివాసుల ప్రత్యేక గుర్తింపు వంటివి ముందుకొచ్చాయి. ఇందులో కొన్ని అప్పటిదాకా కొనసాగుతూ వచ్చిన 'సాంప్రదాయిక' అవగాహనని ప్రశ్నించడంతోపాటు, ఎంఎల్ పార్టీల నాయకత్వాలకి దాటవేయ వీలులేని 'ఇబ్బంది కరమైన' ప్రశ్నలని ఈ ఉద్యమాలు లేవనెత్తాయి (వ్యాసం 9 – ఒక అబ్రహాం కథ, వ్యాసం 10-వీరయ్య మరణం)

3. హక్కుల ఉద్యమంలో 'విప్లవ' హింస/రాజకీయ హింస చర్చ కూడా ఈ నేపథ్యంలోనే ముందుకొచ్చింది. ఆయా ఉద్యమాలు ఎంచుకున్న తమవైన 'ప్రతిఘటన'/'ప్రతిహింస' ఎత్తుగడలు కూడా హక్కుల ఉద్యమ పరిధిలో, ప్రజాస్వామిక ఉద్యమాలలో కొత్త ప్రశ్నలని ముందుకు తెచ్చాయి. ఉదా: నిరాయుధులైన రాజకీయ కార్యకర్తలని రాజ్యం హతమార్చినప్పుడు 'ఎన్‌కౌంటర్లన్నీ బూటకమైనవే' అన్న నినాదం, 'గెరిల్లా దళాలకీ, ప్రభుత్వ బలగాలకీ మధ్య 'యుద్ధంలో' సాగే పరస్పరదాడుల సందర్భానికి సూటిగా వర్తించదు (ఆ ఎన్‌కౌంటర్ బూటకం కాకపోవచ్చు). మొదటి సందర్భంలో ఎంఎల్ పార్టీలూ, హక్కుల సంస్థలూ ఒకే విధమైన నినాదం ఇవ్వవచ్చు. 'యుద్ధ' నేపథ్యంలో రెండింటి నినాదాలు, వైఖరులు వేరు, వేరుగా వుండే పరిస్థితి తలెత్తుతుంది. చట్టబద్ధ పరిధిలో లేవనెత్తే విమర్శలకీ, ఆ చట్టబద్ధతని పూర్తిగా తిరస్కరించే వైఖరికి వైరుధ్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ వైరుధ్యం

ఆచరణలో సమస్యలని సృష్టిస్తుంది. *'పౌరహక్కుల ఉద్యమం అవగాహన చట్టంతోపాటు రాజకీయ, సామాజిక, నైతిక వాదనల సమ్మేళనం..... ఒకరి హక్కులని మనం సమర్ధించినప్పుడు, వారి చర్యలకు కూడా మనం జవాబుదార్లు అవుతామనేది సాధారణ నైతిక సూత్రం...చర్యలలోని న్యాయాన్యాయాల జోలికి పోకుండా, పూర్తిగా చట్టపరమైన వాదన ఇవ్వడం అనేది అన్ని సందర్భాలలోనూ సాధ్యంకాదని పౌరహక్కుల కార్యకర్తలు తెలుసుకున్నారు'.* (వ్యాసం 3–విప్లవ హింస హక్కుల దృక్పథం).

4. 1990లు ప్రపంచబ్యాంకు నిర్దేశిత సంస్కరణలకి ఆంధ్రప్రదేశ్ ప్రయోగశాలగా మారినకాలం కూడా. తెలంగాణా ప్రాంతంలో ఎంఎల్ ఉద్యమం ఆధిపత్య వర్గాల అధికారాన్ని దెబ్బతీయడంతో, సామాజిక శక్తుల పొందికలో వచ్చిన మార్పు ఒకవైపు, ఆర్థిక, రాజకీయ రంగాలలో వచ్చిన మార్పులు పరిస్థితులని సంక్లిష్టం చేశాయి. 1990వ దశకంలో రైతుల ఆత్మహత్యలు, ముఖ్యంగా వరంగల్ జిల్లాలో ఆత్మహత్యలు చాలామందిని కలవరపెట్టేయి. 'పాత' సంబంధాలు ధ్వంసమై, వాటి స్థానంలో 'నూతన' సంబంధాలు ఇంకా ఉనికిలోకి రాని, రాలేని పెనుగులాట బీభత్స, విషాద వాతావరణానికి దారితీసింది. మరొకవైపు, ప్రభుత్వ తీవ్ర నిర్బంధపు దాడులలో నష్టాలు, అంతకంతకీ మిలిటరీ నిర్మాణ పటిష్టతపై కేంద్రీకరించిన నిర్మాణ ఎత్తుగడలు, ఎంఎల్ పార్టీల ప్రజా పునాది కుంచించుకుపోవడానికి దారితీసేయి. ఆయా పార్టీల రాజకీయ, నిర్మాణ సమీక్షలలో ఎవరైనా ఈ అంశాన్ని స్పష్టంగా గమనించవచ్చు. (ఉదా: పార్టీ పూర్తికాలం కార్యకర్తలకీ, సానుభూతిపరులకీ మధ్య నిష్పత్తి 1:1 ఉందనీ, దీన్ని కనీసం 1:3కి పెంచుకో వాలనీ ఒక పార్టీ గుర్తించింది). ప్రజాపునాది కుంచించుకుపోవడం ఒకవైపు, రాజకీయంగా చొరవ కోల్పోయి, ప్రజలని ప్రేక్షక పాత్రకి నెట్టిన ఆచరణాత్మక వైఖరి మరొకవైపు–పరిస్థితులలో ఒక శూన్యతని సృష్టించింది. *'ఉత్తర తెలంగాణ ఈరోజు ఒక విషమ స్థితిని ఎదుర్కొంటూ వుంది. ఇక్కడ జీవితమే యుద్ధంగా మారలేదు. జీవితం పైన యుద్ధం తన పాదం మోపింది. అది జీవితంతో సంబంధం లేని యుద్ధం కాదు. అయినప్పటికీ అది 'జీవన యుద్ధం' కాదు. జీవితంకోసం యుద్ధం చేయాలని ప్రజలలో ఎక్కువమంది అనేకోకముందే యుద్ధం వచ్చేసింది. మొదలయిన ఆ యుద్ధం ప్రజలకు ఆ సంకల్పం నేర్పించాలని ఆశిస్తూ వుంది. అయితే అది ప్రజల జీవితంతో సంబంధం లేని యుద్ధం కాదు కాబట్టి ప్రజలు ఏదో ఒక మేరకు భాగస్వాములవుతున్నారు. ఇష్టంగా కొందరు, అయిష్టంగా కొందరు, ఇష్టం, అయిష్టం కలిసిన సందిగ్ధ స్థితిలో కొందరు, తెలంగాణలో పేద ప్రజానీకం దానిలో భాగస్వాములు అవుతున్నారు. అదితప్ప వేరే జీవితం తెలియని తరం ఒకటి తయారవుతున్నది. ఈ యుద్ధం ఆదర్శాలకంటే దాని బలప్రయోగ సామర్ధ్యానికి ఎక్కువగా ఆకర్షితులవుతున్న తరం ఇప్పటికే తయారయింది. ఆ సామర్ధ్యానికి సలాం కొట్టి తమ స్వప్రయోజనాలు సాధించుకునే అవకాశవాద మూక కూడా తయారయింది'.* (వ్యాసం 4–తెలంగాణలో వంద గొంతులు వినిపించాలి). *'కొంతవరకు తామే తెచ్చుకున్న ఈ పరిస్థితికి సాయుధ పోరాట రాజకీయాలు మూల్యం చెల్లిస్తున్నాయేమో. దూరంనుంచి ఇది అన్యాయం అనుకున్నంతగా దగ్గరకొచ్చి ఇది మనది, మనకు జరిగిన అన్యాయం అని ప్రజాసామాన్యం అనుకోలేకపోతున్నారు. మరీ ఘోరమైన ఒక సంఘటన జరిగినపుడు కొంత జనం జమ అవుతుండవచ్చు. కానీ అది అక్కడితో ఆగి పోతున్నది.* (వ్యాసం 13 – ప్రాణం 'ఖరీదు' వారికి ఎంతో వీరికీ అంతే).

బాలగోపాల్ అభిప్రాయాలలో, అంచనాలలో వచ్చిన పరిణామానికి 'చీకటి కోణాలు' వ్యాసం ఒక తార్కికమైన ముగింపుగా చూడవచ్చు. ప్రస్తుత సంకలనంలో ప్రధానమైన వ్యాసం కూడా ఇదే (దాదాపు మూడు వందల పేజీల సంకలనంలో తొంభై పేజీల వ్యాసం ఇది). 1998లో రాసిన ఈ వ్యాసంలోని వైఖరి ఆ తర్వాత కాలంలో స్థిరంగా కొనసాగిందనే చెప్పుకోవచ్చు. *'అభ్యుదయం కోసం ప్రాణాలు తీసే హక్కు తమకుందనీ, ఏది అభ్యుదయమో నిర్ణయించుకునే విజ్ఞత సహితం తమకుందనీ ప్రకటించుకునేవారిని బహిరంగం గానే బోనులో నిలబెట్టి ప్రశ్నించాలి. ఇతరుల హక్కులను (జీవించే హక్కుతో సహా) విప్లవం కోసం హరించడానికి ఎంతమాత్రం వెనకాడని వారిని విమర్శించడానికి మనం వెనకాడనక్కర లేదు. వెనకాడినట్లయితే శాస్త్రీయ విజ్ఞతని తమకు తాము ఆపాదించుకొని ఆ పార్టీలు తీస్తున్న ప్రాణాలకూ, హరిస్తున్న హక్కులకూ, ప్రజలకు కలిగిస్తున్న కష్టాలకూ మనమందరం కూడా బాధ్యులం అవుతాము. ఈ విషయం గుర్తించ డానికీ, గుర్తించిన తర్వాత కూడ మాట్లాడడానికి ఈ రాష్ట్రంలోని ప్రజాతంత్రవాదులు చాలామంది – నాతో సహా – చాలాకాలం అన్నీ తెలిసీ తటపటాయించడంవల్ల చాలా నష్టం జరిగిందను కుంటాను'..... 'తెలంగాణాలోనూ, ఏజెన్సీలోనూ కొన్ని రకాల సామాజిక ఆర్థిక ఆధిపత్యాన్ని, అన్యాయాన్నీ పోగొట్టడానికి నక్సలైట్ పార్టీల బలప్రయోగ రాజకీయాలు చాలా ఉపయోగ పడ్డాయి. (మొదట్లో ఈ రాజకీయాలలో బలప్రయోగంతో పాటు ప్రజాసమీకరణ కూడ చెప్పుకోదగ్గ మోతాదులో వుండిందనేది కూడా సత్యమే). ఈ మార్పు బలప్రయోగం అవసరం లేకుండా వచ్చివుంటే బాగుండేది. ఎందుకంటే, బలప్రయోగంతో, లేక బలప్రయోగ భయంతో వచ్చేమార్పుకంటే సామాజిక సంస్కృతిలో పరిపూర్ణంగా జీర్ణమైన తరువాత వ్యవస్థీకృత మయ్యే మార్పే స్థిరంగా, సహజంగా వుంటుంది కాబట్టి. కానీ దీనికి తప్పు పట్టవలసింది బల ప్రయోగం చేసిన వారిని కాదు. ప్రత్యామ్నాయ మార్గాలు సాగనివ్వని వారిని. అయినప్పటికీ–ఆ మేరకు బలప్రయోగం ద్వారా న్యాయాన్ని నిల బెట్టిన వారి కృషిని గుర్తిస్తూనే – ఆ పని బలప్రయోగం ద్వారా చేపట్టడంవలన వచ్చిన నష్టాలను సహేతుకంగా గుర్తించవలసిందే. అప్పుడు మాత్రమే వాటిని చక్కదిద్దడం సాధ్య మౌతుంది. అది అవసరాన్ని మించిన రాశిలో వుండకుండా చూడడం సాధ్యం అవుతుంది.' (వ్యాసం 5–చీకటి కోణాలు).* ఈ వ్యాసంలో బాలగోపాల్ లేవనెత్తిన ప్రశ్నలూ, వివిధ ఎంఎల్ గ్రూపుల ఆచరణని సోదాహరణంగా పేర్కొంటూ ఒక పరంపరగా ఉటంకించిన సంఘటనలూ తీవ్రమైన చర్చకు, నిశితమైన విమర్శలకూ దారితీసేయి.

**కలవరం కలిగించే ప్రశ్నలు, ఇబ్బంది పెట్టే సమాధానాలు**

*'దారితప్పిన వొంటరి మనిషి*
*భయపెడతాడు*

*జ్వరతీవ్రతలో పలవరించే*
*రాస్కల్నికోవ్‌లు భయపెడతారు*
*కాలిబాటలు చిట్లి కలలు చీలిన*
*అడవి భయపెడుతుంది*
*చెట్టుకి వుట్టిగట్టిన తలలో*
*మూసుకుపోని కళ్ళు భయపెడతాయి*
*చరిత్ర కోటగోడలని కొండచిలువలా*
*చుట్టుకున్న చీకటి అగడ్త భయపెడుతుంది*
*ఉరిమే మౌనం నిండిన శూన్యంలో*
*పూరించని ఖాళీలు తరుముతాయి*
*బహుశా అప్పుడు గురి గురించీ,*
*గురి చూసే మనుషుల గురించీ,*
*దారి గురించీ మాట్లాడుకోవాలి'*

'చీకటి కోణాలు' వ్యాసంలో బాలగోపాల్ లేవనెత్తిన చర్చ ఇదీ. *'నక్సలైట్లు ఎంచుకున్న పోరాట పంథా వారికి రాజ్యాధికారం తెచ్చి పెడుతుందా లేదా అన్నదొక్కటే దాని మంచి చెడులను చర్చించడానికి గీటురాయి కాకూడదు. 'విలువలు సార్వత్రికమా' అని ప్రశ్నించేవారి మనస్సులో ఉన్న భావన ఇదేనైతే దానిని వదులుకోవడం అవసరం. ఆ లోపల వారు తయారుచేస్తున్న సామాజిక సంస్కృతి ఎటువంటిది? దేనిని ధ్వంసం చేస్తున్నారు? దేనిని నిర్మిస్తున్నారు? ఎవరికి హాని చేస్తున్నారు, ఎంత చేస్తున్నారు, ఎందుకు చేస్తున్నారు? ఎటువంటి వ్యక్తులను ఉద్యమాలవైపు ఆకర్షిస్తున్నారు, ఎటువంటి కార్యకర్తలను తయారు చేస్తున్నారు? ...మొదలైన ప్రశ్నలన్నీ వేసుకోవాలి'.*

తెలంగాణ, రాయలసీమ, గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర ప్రాంతాలలోని వివిధ ఎంఎల్ పార్టీల చర్యలు, ఆచరణలపై వుటంకించిన ఉదాహరణలు (దాదాపు 50) చాలా తీవ్రమైన కలవరాన్ని రేకెత్తిస్తాయి.

*'బండరాళ్ళు ఎత్తి మీదవేసి ఒళ్ళు విరగ్గొట్టారని విన్నప్పుడు, నడుముకు గ్రెనేడ్ కట్టి పేల్చి మనిషిని తుత్తునియలు చేసారని విన్నప్పుడు, ఇనపరాడ్లతో ఒళ్ళంతా విరగ్గొట్టి లేదా గొడ్డలితో తెగనరికి భార్యాపిల్లల సమక్షంలో పడేసి, 'పొద్దున్న దాకా ఆస్పత్రికి తీసుకుపోవడానికి వీల్లేదని' శాసించిపోగా, ఊళ్ళో జీపు ఉన్నప్పటికీ, ఆ సాహసం చేయలేక అయిన వాళ్ళందరూ నిస్సహాయంగా విలపిస్తుండగా తెల్లవారే లోపల విలవిలలాడి చనిపోయాడని విన్నప్పుడు, ఒళ్ళు జలదరించే భయం పుడుతుంది..... కానీ గొడ్డలితోనో బండరాళ్ళతోనో తల పగులగొట్టి, ముఖం నుజ్జు నుజ్జు చేసి చంపడమేకాక తుపాకితో కాల్చి చంపేటప్పుడు కూడ ఛాతిలో కాల్చకుండా గడ్డంకింద కాల్చి ముఖం మొత్తం పేల్చేయడం నక్సలైట్లు చేసే హత్యలలో తరచుగా కనిపించే వికృత దృశ్యం.... ముక్కుపుటాలలో తపంచా పెట్టి తల ఎగిరిపోయేలాగ కాల్చడమే కాక కాలిపోయిన పుర్రెలో అతనిని ఎందుకు చంపారో చెప్పే చిట్టీ పెట్టి మరీ పోయారు. ఎంత వికృతమైన మానసిక స్థితి ఉన్నవాళ్లు కాకపోతే ఈ పని చేయగలరు?'*

ఈ విమర్శ సహజంగానే ఆయా పార్టీలని నొప్పించింది. ఆయా పార్టీల అభిమానులని కలవరపెట్టింది. దీనిపై ప్రధానంగా నాలుగు రకాల ప్రతిస్పందనలు వెల్లడయ్యాయి.

- ఇవన్నీ అబద్ధాలు
- అదే కదా, మేం ఎప్పటినుంచో చెబుతూ వున్నది
- అసలు మీరెవరు ఇందులో వాస్తవాలు నిర్ధారించడానికి?
- కొన్ని నిజాలుండవచ్చు, కానీ...

1. మొదటి ప్రతిస్పందన. 'బాలగోపాల్ చెబుతున్న సంఘటనలేవీ నమ్మశక్యంగా లేవు. అవి నిజాలు కావు'. ఇలాంటి ప్రతిస్పందనల విషయంలో, వారి 'దృఢ' విశ్వాసాలని గౌరవించి, నమస్కరించి వూరుకోవడంతప్ప ఎవరైనా చేసేది, చేయగలిగింది ఏమీ లేదు.

**2.** రెండవ కోవకి చెందిన ప్రతిస్పందన ఇదీ. 'బాలగోపాల్ ఇప్పుడు చేస్తున్న విమర్శలు మేము ఇంతకు ముందు చేసినవే గదా?' ఈ మాటలలో కొంత వాస్తవం లేకపోలేదు. ఈ తరహా ప్రతిస్పందన వివిధ శిబిరాల నుంచి వచ్చింది.

ఇందులో ఒకవైపు పోలీసులూ వున్నారు. ప్రభుత్వ అణచివేత విధానాలకి సైద్ధాంతిక సమర్ధనగా బాలగోపాల్ వాదనలని వుపయో గించుకునే ప్రయత్నం వాళ్ళు సహజంగానే చేశారు. అయితే, ఆ ప్రయత్నం సఫలం కాలేదు. ప్రజాస్వామిక హక్కుల అవగాహన, ఆచరణలో బాలగోపాల్ ప్రజలకోణం నుంచి స్థిరంగా నిలబడడమే అందుకు ప్రధానమైన కారణం.

మరొకవైపు, స్త్రీవాదులూ, మానవతా వాదులూ, ఉదార ప్రజాస్వామికవాదులూ వున్నారు. నక్సలైట్ ఉద్యమంపై వాళ్ళ విమర్శ, వాళ్ళు చెప్పిన/చెబుతూ వచ్చిన విషయాలు ప్రధానంగా వాళ్ళ, వాళ్ళ సిద్ధాంత, రాజకీయ అవగాహనలనుండి వచ్చినవి. ఆ మేరకి, ఉద్యమాలతోనూ, బాలగోపాల్ అవగాహనల తోనూ వారి విభేదాలు కొనసాగుతూనే వుంటాయి. (ఆయన అభిప్రాయాలలో మార్పురాక ముందూ, వచ్చిన తర్వాత కూడా). ఇక్కడ గుర్తించాల్సిన విషయం, విభిన్న శిబిరాల విమర్శలు, అవగాహనలతో బాలగోపాల్ వాదనలలో కనిపించే సామ్యం కాదు. ఉద్యమాలలో లోపాలనీ, బలహీనతలనీ, పరిమితులనీ ఎవరు ఎంత

ముందుగా విమర్శించారు, గుర్తించారు అన్నది పరుగు పందెంలో పోటీ కాదు. ఒకవేళ ఆయా అంశాలని తామే మొదటగా గుర్తించామని ఎవరైనా చెప్పుకున్నా, అవే అంశాలని మరొకరు, మరొక రూపంలో అంతకుముందే గుర్తించారని వాదించవచ్చు, ఆధారాలలో రుజువు చేయనూ వచ్చు.

అయితే, బాలగోపాల్ లేవనెత్తిన విషయాలు, నిర్దిష్ట ఆచరణకి సంబంధించిన 'వాస్తవాల'తో సన్నిహితంగా ముడిపడి వున్నవి. బాలగోపాల్ వాదనలకి ఖచ్చితమైన బలం అందులోనే వుంది. మారిన పరిస్థితులతోపాటు, ఇతర ఉద్యమాలు లేవనెత్తిన ప్రశ్నలు వ్యక్తులు, సంస్థలు అందరి లోనూ పునరాలోచనలకీ, అభిప్రాయాలలో మార్పులకీ దారితీసాయనేది వాస్తవం. అందుకని, అభిప్రాయాలలో/అవగాహనలో మార్పు, వ్యక్తిగా బాలగోపాల్‌కి మాత్రమే పరిమితమైన విషయం కాదు. కాలక్రమంలో బాలగోపాల్ అవగాహనలో మార్పు వచ్చినా, ఆయన వ్యాసాలకి, వాదనలకి వాస్తవాలే కేంద్రంగా వున్నాయని ఈ సంకలనం లోనూ మనం గమనించవచ్చు.

**3.** మూడవ ప్రతిస్పందనలో, నిజానిజాలు నిర్ధారించడానికి 'బాలగోపాల్ ఎవరు? ఆయన కున్న అర్హత ఏమిటి?' అన్న ప్రశ్నవేయడం కొంచెం చిత్రమైనది. ఆయా ఘటనలలో నిజా నిజాలని తేల్చడానికి బాలగోపాల్ ఎవరు అన్న ప్రశ్న వేసి, అది తేల్చవలసింది 'ప్రజలు'/అక్కడి 'పార్టీ' (మరి కొంచెం సాగదీస్తే, పార్టీ కమిటీ/పార్టీ కార్యకర్తలు) కదా అని చెప్పిన సమాధానం ఆశ్చర్యం కలిగించక మానదు. బాలగోపాల్ లేవ నెత్తిన ఉదాహరణలలో వాస్తవాలు అయిన వేమిటి, కానివేమిటి అన్న చర్చకి బదులు, అసలు సత్యాన్ని గుర్తించేందుకు / నిర్ధారించేందుకు వ్యక్తుల అర్హతలు ఏమిటి అనే ప్రశ్నని ఈ అవగాహన ముందుకి తెస్తుంది. కార్యకర్తల స్థాయినిబట్టి, కమిటీలనిబట్టి, కాలాన్ని బట్టి ఆయా పార్టీల అవగాహనలే (అందుకు అనుగుణంగా వాస్తవాలు కూడా?) మారిపోతాయి. దీనికి ఎన్నో ఉదాహరణలు వున్నాయి. వాస్తవాల పరిశీలన, "నిజనిర్ధారణ" విషయంలో మనకి అనుకూలమను కున్నప్పుడు అవసరంలేని అర్హతల ప్రశ్న, మనకి ఇబ్బంది కలిగించే నిజనిర్ధారణల విషయంలోనే తలెత్తడం రాజకీయ అవకాశవాదానికి పరాకాష్ట. అది తాత్వికస్థాయిలో సత్యాన్ని గుర్తించడంలో, వాస్తవికతని విశ్లేషించడంలో అధిభౌతిక దృక్పథానికి నిదర్శనం.

బాలగోపాల్ విమర్శని, అభిప్రాయాలనీ ఆయనలో పెరిగిన 'పోస్ట్ మోడర్న్' ధోరణి ఫలితంగా కొందరు చూశారు. పోస్ట్ మోడర్నిజం పట్ల బాలగోపాల్ అవగాహనలని "మనిషి మార్క్సిజం" వ్యాసాల సంకలనంలో చూడవచ్చు. పోస్ట్ మోడర్నిజం విమర్శలని గుర్తిస్తూనే, దాని పరిమితులని కూడా బాలగోపాల్ స్పష్టంగా పేర్కొన్నారు. అందుకని, బాలగోపాల్ వాదనలని, విమర్శలని ఆయనలో పెరిగిన 'పోస్ట్ మోడర్నిజం' ఫలితంగా చూడడం సరికాదు.

ఇలాంటి ప్రతిస్పందనలు కొన్ని ఎంఎల్ గ్రూపుల వున్నత నాయకత్వాలనుంచే రావడం, ఆనాటి చర్చ తీరుకి అద్దంపడుతుంది. ఈ చర్చ ఆరోగ్యకరంగా జరగలేదని ఇప్పటికైనా గుర్తించడం ఎంతైనా అవసరం.

మరొక స్థాయిలో పోలీసు నిర్బంధాలకి భయపడి బాలగోపాల్ ఉద్యమాలని విమర్శి స్తున్నాడని వాదించిన వారున్నారు. పోలీసు నిర్బంధాలకి భయపడ్డారనో, పోలీసు ఏజెంట్లుగా మారారనో చేసే వాదనలకి సమాధానమిచ్చే ప్రయత్నం కూడా వ్యర్థమే.

మరికొంతమంది వాస్తవాలు, ఘటనలపై ఆధారపడి బాలగోపాల్ లేవనెత్తిన ప్రశ్నలు, విమర్శలని వాటి బలహీనతగా చూసారు. చర్చని సిద్ధాంత స్థాయిలో సాగించాలన్నారు. 1980 లలో ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సంబంధాలలో మార్పులపై (మార్క్సిస్టు) శిబిరంలో సాగిన 'అకడమిక్' చర్చ 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' పత్రిక 'ప్రత్యేక వ్యాసాల'లో జరగగా, తెలంగాణ ప్రాంతంలో రైతుకూలీల పోరాటాలు, ప్రభుత్వ నిర్బంధకాండపై బాలగోపాల్ రాసిన వ్యాసాలు, నివేదికలు నిర్దిష్టత మీద ఆధారపడి వుండేవి. తొలినాళ్ళలో బాలగోపాల్ వ్యాసాలు వాస్తవాల మీద, నిర్దిష్టత మీద ఆధారపడినవిగా చూసి, అదే ఆ వ్యాసాల బలం అని ప్రశంసించిన ఈ విశ్లేషకులు, తర్వాతికాలంలో దాన్నే 'బలహీనత'గా చెప్పడం ఒక వైచిత్రి!

'కమ్యూనిస్టు ప్రణాళిక' తొలి వాక్యం, ఫోయెర్ బాక్‌పై మార్క్స్ పదకొండవ సూత్రీకరణలమీద ఆధారపడిన నిర్దిష్ట విశ్లేషణకి బాలగోపాల్ వ్యాసాలు ఉదాహరణ అని మొదట ప్రశంసించిన వాళ్ళు, ఆ తర్వాతి కాలంలో, వాస్తవాలని పక్కనబెట్టి, ముందు (వర్గ పోరాటాలపై) సిద్ధాంత అవగాహనని చర్చించాలన్నారు! అంటే వాస్తవాలపై చర్చ వాయిదా అన్నమాట. వర్గ పోరాట సిద్ధాంతంపట్ల ఏకాభిప్రాయంవున్నా, ఒకానొక నిర్దిష్ట ప్రాంతంలోనో లేదా గ్రామ స్థాయిలోనో జరిపే వర్గ విశ్లేషణపైన, 'వర్గ పోరాటం' పట్ల వేర్వేరు సంస్థలమధ్య, చివరికి ఒకే సంస్థలో సైతం భిన్నాభిప్రాయాలు తలెత్తే మాట తిరుగులేని వాస్తవం. పరస్పరదాడులు, హత్యలని సమర్థించుకుంటూ వివిధ నక్సలైట్ సంస్థల వాదనలు అందరూ చూసినవే. ఆయా ఘటనలలో వాస్తవాలపై చర్చ, వర్గపోరాట సిద్ధాంత చర్చకి పోటీ కాదు, ప్రత్యామ్నాయమూ కాలేదు.

**4.** నాలుగవతరహా ప్రతిస్పందన, 'వీటిలో నిజాలుండవచ్చు. అయితే' అన్న సంశయాత్మక వైఖరితో కూడుకున్నది. ఈ వైఖరి గురించి చర్చ ఇంకా కొనసాగవలసే వుంది. ఆయా సంఘటన లలో తప్పొప్పుల్ని గుర్తించి, అంగీకరించడంలో ఊగిసలాట వ్యక్తులకీ, సంస్థలకీ ఎప్పుడూ వుండేదే. ఎలాంటి వైఖరి తీసుకున్నా, ఆ ప్రశ్నలు, వాటిపై చర్చ దాటవేయడానికి వీలులేనివి. 'ఇలాంటి ఘటనలు కొంతవరకూ నిజమే అయినా, వాటిని అంగీకరించడంవల్ల పార్టీకి (ఉద్యమానికి) నష్టం తలెత్తుతుంది కదా, ప్రత్యర్థులకి ప్రయోజనం చేకూరుతుంది కదా' అన్న సంశయం చాలామందిలో చాలాసార్లు సహజం గానే తలెత్తుతుంది. రెండవ ప్రపంచ యుద్ధా నంతర కాలంలో, సోవియట్ శిబిరంపై విమర్శ అమెరికా సామ్రాజ్యవాదులకి మేలు చేస్తుంది కదా అన్న సంశయం చాలామందిని వెంటాడింది. ఈ సంశయం ఒక స్థాయిలో ఇబ్బంది పెట్టే మౌనానికి, మరొక స్థాయిలో అవకాశవాదానికి దారితీస్తుంది.

బాలగోపాల్ అభిప్రాయాలలో మార్పుని 'విప్లవ వాది' నుంచి 'సంస్కరణవాది'గా సూత్రీకరించిన కొందరు ఉద్యమ సమర్ధకులు, ఇంకొంచెం దూరం ముందుకుపోయారు. "బాల గోపాల్ ప్రాధమ్యాలు, ప్రాపంచిక దృక్పథంలో మార్పుతో, అధికారయంత్రాంగం ఆయన పట్ల చూపే వైఖరిలోనూ మార్పు వచ్చింది. ఆయన ఇక ఎంతమాత్రమూ రాజ్యానికి శత్రువు కాదు. అధికార మేధావులు ఆయనని పొగడ నారంభించారు" అంటూ వ్యాఖ్యానించారు. ఇందులోని వైఖరి స్పష్టంగా వుంది. రాజ్య యంత్రాంగం బాలగోపాల్ పట్ల 'అనుకూల' వైఖరి తీసుకుందనే ఆరోపణతో వీళ్ళు బాలగోపాల్ విమర్శలని తిరస్కరిస్తున్నారు. ఆ ఆరోపణలో నిజానిజాలని పక్కనబెడితే, ఈ కొలమానం ప్రకారం, ఇదే ఉద్యమ సమర్ధకులు ఎంత విప్లవ కరంగా వున్నారన్న ప్రశ్న (లేదా రాజ్యం ఈ 'ఉద్యమ సమర్ధకులని' ఎలా చూస్తున్నది అన్న ప్రశ్నని) వాళ్ళకే వదిలివేయడం మంచిది! అభిప్రాయాలలో మార్పు ఎలా వున్నా, బాలగోపాల్ తుది దాకా ప్రజాస్వామికవాదిగా స్థిరంగా నిలిచాడనే విషయంలో ఎవరి సర్టిఫికెట్లూ అవసరం లేదు. బాలగోపాల్ తన విమర్శలలో పేర్కొన్న నిర్దిష్ట ఘటనలు, వాస్తవాలపట్ల నోరు మెదపకుండా సంపూర్ణమైన మౌనం పాటించడమే వీళ్ళు ఎంచుకున్న మరొక వైఖరి. అవి నిజమనో, కాదనో తేల్చకుండా, వాటిని తాము ఎలా చూస్తున్నామో ప్రకటించకుండా ఎంచుకున్న ఈ మౌనమునులని ఎలా చూడాలి?

ఉద్యమాల పట్ల, ఉద్యమాల నాయకత్వాల పట్ల, శ్రేణుల ఆచరణపట్ల (వున్న) విమర్శలని ఏదో ఒక కారణంతో వాయిదా వేసే ఇలాంటి వైఖరి అంతిమంగా ఆయా ఉద్యమాలతోపాటు ఇతరఉద్యమాలకీ నష్టంచేస్తుంది. ఎల్.టి.టి.యి, పాలస్తీనా లిబరేషన్ ఫ్రంట్, పెరూ షైనింగ్ పాత్, నేపాల్ మావోయిస్టు పార్టీల దాకా చాలా ఉదాహరణలు మనముందున్నాయి. ఇందులో వ్యక్తులు, సంస్థలలో (సదుద్దేశ్యంతో కూడిన) సందిగ్ధతకి తావు వుంటుందని గుర్తిస్తూనే, శాశ్వతంగా ఆ సందిగ్ధతని కొనసాగిస్తే, అది ఆ ఉద్యమాలకి ఎలాంటి మేలూ చేయదని గుర్తించడం అవసరం. మనం గుర్తించడానికి భయపడితే, అంగీకరించ నిరాకరిస్తే వాస్తవాలు మారవు, అవి మరింత వికారమైన, వికృతమైన పరిణామాలకి దారితీయవచ్చు. మాట్లాడాల్సిన విషయాలు మాట్లాడి తీరవలసినదే. సత్యం అప్రియమైనదైనప్పుడు, వాస్తవాలు చేదుగా వున్నప్పుడు తటపటాయింపుతో కూడిన మౌనం నష్టంచేస్తుంది. సదుద్దేశ్యం హానిచేయదనే హామీ ఏమీ లేదు. చరిత్రలో అందుకు సాక్ష్యాలు కోకొల్లలు.

నక్సలైట్ గ్రూపుల ఆచరణని విమర్శిస్తూ బాలగోపాల్ రాసిన వ్యాసాలలో పేర్కొన్న సంఘటనలలో ఎక్కువభాగం (పేద) ప్రజల మధ్య వైరుధ్యాలకి సంబంధించినవి కావడం గమనార్హం. ఈ కారణంరీత్యా కూడా ఇవి మన పరిధిలోకి రానివనీ, ఇందులో వాస్తవాలని (బాలగోపాల్ వంటి) 'బయటి' వ్యక్తులు తేల్చలేరనీ, ఒకవేళ అవి వాస్తవాలే అయినా వాటిని బహిరంగంగా చర్చకి పెడితే నష్టం కనుక మౌనమే సన్మార్గ భూషణమని ఊరుకుంటే, ఆ వైరుధ్యాలు మరింత హానిచేసే ఫలితాలకీ, పర్యవసానాలకీ దారితీస్తాయి. ఆ ఫలితాల ఫలితాన్నీ, పర్యవసానాల పర్యవసానాన్నీ మనం ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో చవిచూస్తున్నాం.

**మళ్ళీ ఎందుకు?**

*'కార్మిక వర్గ విప్లవాలు... తమని తాము నిరంతరం విమర్శించుకుంటాయి. తమ గమనంలో తమని తాము నిరంతరం అడ్డు కుంటాయి, తిరిగి కొత్తగా ప్రారంభించుకోవడం కోసం, మునుపు పరిపూర్తి చేసుకున్నట్లనిపించిన చోటికే తిరిగి వస్తాయి, తమ తొలి ప్రయత్నాల లోని అరకొర చర్యలనీ, బలహీనతలనీ, లోపాలనీ నిర్దాక్షిణ్యంగా విమర్శించుకుంటాయి'.*[4] – కార్ల్ మార్క్స్

తీవ్రమైన ప్రతిస్పందనలకి దారితీసిన "చీకటి కోణాలు" వ్యాసంతోపాటు ఇతర వ్యాసాల సంకలనాన్ని, తెలుగు రాష్ట్రాలలో నక్సలైట్ ఉద్యమం వెనుకపట్టు పట్టిన నేపథ్యంలో/లేదా మళ్ళీ పుంజుకునే ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో మళ్ళీ ఎందుకు తీసుకువస్తున్నారని కొందరు ప్రశ్నించవచ్చు.

ముందే చెప్పుకున్నట్టు బాలగోపాల్ వ్యాసాలపైన, అవగాహనలలో వచ్చిన పరిణామం పైనా (వివాదాస్పదమైన) చర్చ జరిగింది. వ్యక్తులు, సంస్థలు తమవైన సమాధానాలు, తీర్పులు ప్రకటించారు. ముద్రలు వేశారు. ఈ చర్చలలో తీవ్రమైన ఆరోపణలు, నిందలు వచ్చాయి.

బాలగోపాల్ వాదనల పైన సిద్ధాంత స్థాయిలో చర్చ జరగవలసినదే. తన అవగాహన లతో మనం విభేదించవచ్చు, వాటిని మనం విమర్శించవచ్చు. అయితే, ఈ సిద్ధాంత చర్చ (అది ఎంత ఉన్నతమైనదైనా,) అమానవీయమైన చర్యలపట్ల, ఆచరణలో లోపాలు, తీవ్రమైన తప్పిదాల పట్ల జవాబుదారీతనం నుండి మనల్ని తప్పించలేదు.

ఈ చర్చ జరిగిన పద్ధతి, ఉద్యమ సంస్థలు ప్రతిస్పందించిన తీరు నష్టంచేసిందా, లేదా అన్న ప్రశ్న ఇప్పటికైనా అందరూ వేసుకోవాల్సి వుంది. బాలగోపాల్ వ్యాసాలు 'విప్లవోద్యమంపై విషం చిమ్ముతున్నాయని' రాసిన సిద్ధాంతకర్తలున్నారు. అది నిజమయితే, చర్చలలో 'మధ్యవర్తిగా' విషం చిమ్మే వ్యక్తిని ఎందుకు ప్రతిపాదించారన్న ప్రశ్న వాళ్ళు వేసుకోవాల్సి వుంటుంది. ఉద్యమం వెనుకపట్టు పట్టడానికి బాలగోపాల్ కారణం కాదు. అయితే, బాలగోపాల్ 'మార్క్సిజం' నుండి వైదొలగడంపైన, ఆయన వాదనలలో 'రివిజనిస్టు బెర్న్ స్టీన్'ని చూపడంపై కేంద్రీకరించినంతగా ఆయా వ్యాసాలలో లేవనెత్తిన ప్రశ్నలు, వాస్తవాల నుంచి ఆచరణలో గుర్తించవలసిన అంశాలు ఏమైనా వున్నాయా అన్న దానిపై చర్చ జరగ లేదు. వాస్తవాలని గుర్తించని ఏ చర్చ అయినా మార్క్సిజానికి చేసే చేర్పు ఏమీ వుండదు.

బాలగోపాల్ లేవనెత్తిన ప్రశ్నలలో కొత్తవి ఏమీలేవని ఎవరైనా అనవచ్చు. నిజమే, సామాజిక మార్పులో హింస పాత్ర, సంకల్ప పూర్వకమైన కార్యాచరణలో ఎంచుకునే హింసా/అహింసా మార్గాలు, లక్ష్యాలు, వాటిని సాధించడానికి వ్యక్తులు, సంస్థలు ఎంచుకునే మార్గాలు, సంస్థల లోపల అంతర్గత ప్రజాస్వామ్యం, సంస్థలు ఇతరులతో (వ్యక్తులతో, సమూహాలతో, ఇతర సంస్థలతో) వ్యవహరించడంలో జవాబుదారీతనం, వ్యక్తుల చైతన్యం, పరివర్తన, హక్కులపట్ల అవగాహన, అధికారం చెలాయించడంలో

తలెత్తే పతనం, నిరంకుశ పోకడల్ని నివారించడం, అందుకు తగిన వ్యవస్థల నిర్మాణం వంటి వాటిపై మార్క్సిస్టు శిబిరం లోపలా, బయటా అనేక చర్చలు జరిగేయి. అయితే ప్రతి చర్చా ఒక నిర్దిష్ట స్థల, కాలాల నేపథ్యంలో జరిగిందే. భారత దేశపు నిర్దిష్ట నేపథ్యంలో, మారుతున్న సామాజిక వాతావరణంలోనుండి లేవనెత్తినవే బాలగోపాల్ ప్రశ్నలు.

పై ప్రశ్నలు పాతవేననుకుంటే, పైన చెప్పుకున్న నాలుగు ప్రతిస్పందనలలో సమాధానాలు కూడా అంతే పాతవి అని మనం గమనించ వచ్చు. ఇందుకు, ఎవరినీ నిందించ నవసరంలేదు. పాత ప్రశ్నలే వేరు వేరు సందర్భాలలో, వేర్వేరు రూపాలలో తిరిగి, తిరిగి తలెత్తుతున్నాయంటే, ఆ ప్రశ్నలని మన సమాజమూ, మన ఉద్యమాలూ ఇంకా సంతృప్తికరంగా అధిగమించలేదని అర్థం. పాత సమాధానాలు సరిపోలేదని అర్థం. పాత సమాధానాలతో సరిపుచ్చుకునే వ్యక్తుల స్వేచ్ఛనీ, విశ్వాసాలనీ గుర్తించి, గౌరవిస్తూనే, క్రొత్త సమాధానాల్ని వెదుక్కోవలసిన అవసరం ఏమైనా వుందేమో ఆలోచించాలి.

20వ శతాబ్దపు విప్లవాల విజయాల నుంచి నేర్చుకున్నంతగా, వైఫల్యాల నుంచి నేర్చుకోవడానికి సిద్ధంగా వున్నామా అన్న ప్రశ్న మనం వేసుకోవలసి వుంది. అసలు వైఫల్యాలని వైఫల్యాలుగా స్పష్టంగా గుర్తించడానికీ, సూటిగా అంగీకరించడానికీ మనం సిద్ధంగా వున్నామా అన్నది మరొక ప్రశ్న. ఈ ప్రశ్నలు అనివార్యంగా మనల్ని ఇబ్బందిపెడతాయి.

మారుతున్న సామాజిక సంబంధాలు, వస్తుగత పరిస్థితులు ఇప్పటికే నక్సలైట్ ఉద్యమాన్ని ప్రభావితం చేశాయి, చేస్తున్నాయి. పెట్టుబడి చొరబాటుతోపాటు, గ్రామీణ ప్రాంతాలలో పోరాటాలలో వచ్చిన, వస్తున్న మార్పులు వివిధ కోణాలనుండి ప్రశ్నలు లేవనెత్తు తున్నాయి. భూస్వాములకీ, అశేష ప్రజానీకానికీ మధ్యనున్న వైరుధ్యమే ప్రధాన వైరుధ్యం అన్న తొలిరోజుల సూత్రీకరణల నుంచి నక్సలైటు సంస్థలు చాలా దూరమే ప్రయాణం చేశాయి. అధికారిక వైఖరులు ఎలా వున్నా, అన్ని సంస్థల లోనూ ఈ అంశంపై విభేదాలు, చర్చలు జరుగుతున్నాయన్నది వాస్తవం. అలాగే 'జాతీయ బూర్జువా' వర్గం ఉనికి, స్వభావం, విప్లవంలో దాని పాత్ర అన్న అంశంపైనా (చర్చలు జరపక పోయినా) భిన్నాభిప్రాయాలున్నాయి. దళిత సమస్య పైన, అణగారిన సమూహాల అస్తిత్వ ఉద్యమాలపట్ల, వాటి డిమాండ్లపట్ల వైఖరిపై చర్చలున్నాయి. సాయుధ పోరాటపంథా పైన సైతం చర్చలున్నాయి. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాతో, పట్టణాలలో ఆకస్మిక సాయుధ తిరుగుబాట్లని (ఎలా) జోడించాలనే చర్చలు వున్నాయి. విప్లవానంతర సమాజాలలో ప్రజాస్వామ్యం, హక్కులు, వైయక్తిక స్వేచ్ఛ, నిరంకుశాధికార ప్రాబల్యాన్ని నిరోధించడం, ప్రకృతి వనరుల వినియోగం, పర్యావరణ విధ్వంసం వంటి అంశాలపై అధికారికంగా చర్చలు జరిగినా, జరగకున్నా, మనతో చర్చించే వ్యక్తులనిబట్టి వేర్వేరు సమాధానాలు వినపడతాయి.

లక్ష్యం, దాన్ని అందుకునేందుకు ఎంచుకునే సాధనాలు అనేవి, కేవలం ఒక పక్షం ఎంచుకోవడం మీదనే ఆధారపడి వుండదనీ, అది ప్రత్యర్థి పక్షం అనుసరించే విధానాలతో ముడిపడి వుంటుందనీ అంగీకరించినా, సంకల్ప పూర్వకంగా ఎంచుకునే విధానాలలో, సాధనా లలో వేటిని అనుసరించాలి, వేటిని అనుసరించ కూడదు అన్న విచక్షణకి స్థానం వుందా అన్న ప్రశ్న కీలకమైనది.

చరిత్రకారుడు హాబ్స్ బామ్ మాటలలో చెప్పుకోవాలంటే, ఇరవైయవ శతాబ్ద పరిణామ క్రమంలో, *'యుద్ధభారం సాయుధ బలగాల నుండి, నిరాయుధులైన పౌరులపైకి మళ్ళింది. పౌరులు యుద్ధ బాధితులు కావడం మాత్రమే కాదు, వాళ్ళు యుద్ధానికీ, సైనిక, రాజకీయ కార్యకలాపాలకీ లక్ష్యాలుగా మారిపోయారు. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల మధ్య తేడా కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధంలో చనిపోయిన వాళ్ళలో కేవలం 5 శాతం మంది మాత్రమే పౌరులు, కాగా రెండవ ప్రపంచయుద్ధంలో చనిపోయిన పౌరులు 66 శాతం మంది. ఇవాల్టి యుద్ధాలలో చనిపోయే వారిలో నిరాయుధులైన పౌరులు 80 నుంచి 90 శాతం వరకూ వుంటారని అంచనా'.*[5] *ఇరవైయవ శతాబ్దం చవిచూసిన మారణకాండ మానవ చరిత్రలోనే సాటిలేనిది. అంతకు మునుపటి ఇరవై అయిదువందల సంవత్సరా లలో హతులైన నిస్సహాయుల సంఖ్య 13 కోట్లు కాగా, ఒక్క ఇరవైయవ శతాబ్దపు వంద సంవత్సరాల కాలంలో హతులైన నిస్సహాయులు/నిరాయుధ పౌరులు 16 కోట్లమంది వుంటారని ఒక అంచనా!*[6] *'అవధులు లేని హింసను సృష్టించే ఒక ప్రమాదకరమైన మూలం వుంది. తమ లక్ష్యం మాత్రమే సరియైనదనీ, ప్రత్యర్థుల లక్ష్యం అత్యంత హీనమైనదనీ నమ్మి, విజయం పొందడానికో, లేక ఓటమిని నివారించడానికో, ఎలాంటి పద్ధతినైనా అనుసరించవచ్చు, అలా చేయడం సరైనది మాత్రమే కాదు, తప్పనిసరి యైనది కూడా అని భావించే సైద్ధాంతిక విశ్వాసంలో దాని మూలముంది. దీనితో, అటు రాజ్యమూ, ఇటు తిరుగుబాటుదారులూ ఇరుపక్షాలూ తమ అనాగరిక చర్యలకి నైతిక సమర్థన వుందని భావిస్తారు'.*[7]

లక్ష్యానికీ, దాన్ని సాధించేందుకు మనం సంకల్ప పూర్వకంగా ఎంచుకునే సాధనాలకీ, మధ్య పరస్పర సంబంధం వుందని అంగీకరించి నప్పుడు, ఎంచుకున్న లక్ష్యమే అందుకు అనుగుణమైన సాధనాలని నిర్దేశిస్తుందని చెప్పుకుంటే సరిపోదు. ఆ లక్ష్యంకోసం మనం సంకల్ప పూర్వకంగా ఎంచుకున్న సాధనాలు, విధానాలు ఆ లక్ష్యాన్ని ప్రభావితం చేసి తీరతాయని కూడా గుర్తించాలి.

దీర్ఘకాల సాయుధపోరాట పంథాని ఎంచుకున్న సంస్థలు తమ సుదీర్ఘ ప్రతిఘటనా యుద్ధంలో తలెత్తే ఆటుపోట్లు, వాటితోపాటు తమ నిర్మాణాలలో, వ్యక్తులలో వచ్చే విలువల పతనం, బలహీనతలని కీలకమైన అంశాలుగా గుర్తించాల్సి వుంటుంది. వ్యక్తుల మధ్య తేడాలు, వైరుధ్యాలని ఎదుటి పక్షాలు ఉపయోగించు కునేందుకు వస్తుగతమైన పునాది వుంటుంది. నిర్మాణాల సైనికీకరణతో పరిస్థితి మరింత సంక్లిష్టం అవుతుంది. అపారమైన వనరులూ, బలగాలూ వున్న ప్రత్యర్థి పక్షాలు ఈ శ్రేణుల పతనాన్నీ, బలహీనతలనీ తప్పనిసరిగా ఉపయో గించుకుంటాయి. దీనిని అధిగమించడానికి దగ్గరి మార్గాలు ఏమీ లేవు. సైద్ధాంతిక అవగాహనలో, రాజకీయ విధానాలలో, నిర్మాణాలలో, ఆచరణలో వున్న లోపాలనీ, బలహీనతలనీ అధిగమించే నిరంతర కృషికి

ఎలాంటి ప్రత్యామ్నాయాలూ వుండవు. 'అమానుషంగా మార్చడంలో పోలీసు యంత్రాంగం కృతకృత్యమైంద'ని సమాధానం చెప్పుకుంటే సరిపోదు. అంతర్ దృష్టి లేకుండా, శత్రు పక్షపు కుట్రలని మాత్రమే పరిగణించే పాక్షిక వైఖరి ఫలితాలనివ్వదు.

సాయుధపోరాట పంథాని ఎంచుకున్న సంస్థలు మరొక ముఖ్య విషయాన్ని గుర్తించ వలసి వుంటుంది. కనీస రక్తపాతం, వీలైనంత తక్కువ ప్రాణనష్టం అన్నవి సాయుధ ఉద్యమ సంస్థలకి మార్గదర్శక సూత్రాలుగా వుండాలి. ఇక్కడ 'కనీస రక్తపాతం', 'వీలైనంత తక్కువ ప్రాణ నష్టం' అన్న అంశాలు సాపేక్షమైనవి అని గుర్తిస్తూనే, అసలు అటువంటి చర్చకు, విచక్షణకి తావు ఇస్తున్నారా, లేదా అన్న ప్రశ్న ఉద్యమ సంస్థలు వేసుకోవాలి. శత్రు పక్షం ఎలాంటి సూత్రాలనీ, విలువలనీ గుర్తించకపోయినా, పాటించకపోయినా ప్రజలకోసం పనిచేస్తున్నా మనే సాయుధ ఉద్యమ సంస్థలు వాటిని గుర్తించి తీరాలి. భిన్నమైన విలువలకోసం, మానవీయ ఆదర్శాలకోసం నిలబడ్డామనే సాయుధ సంస్థలు తమ పోరాటాన్నీ, యుద్ధాన్నీ ఆ విలువలు, ఆదర్శాల ప్రాతిపదిక మీదనే నిర్వహించాలి. 'మీరు మమ్మల్ని మాత్రమే ప్రశ్నిస్తున్నారు, శత్రువు ముప్పేట దాడిలో మేము మాత్రమే విలువలు పాటించాలంటే ఎలా? మా చేతులు కట్టివేసి, యుద్ధం చేయమంటే ఎలా?' అన్న మాటలలో సమర్థనలని తరచూ వింటూ వుంటాము. శత్రువు పాటించని ఏ విలువలనీ, నియమాలనీ ఉద్యమ సంస్థలు కూడా పాటించకూడదనుకుంటే, ఇక ఆ యుద్ధం ఏ విలువలకోసం, ఏ ఆదర్శాల కోసం? ఇది హింసాహింసల అధిభౌతిక చర్చ కాదు. విలువలు, ఆదర్శాలకి సంబంధించిన ప్రాథమిక ప్రశ్న. అనుసరించే ఎత్తుగడలపైన, అమలు జరిపే విధానాలపైన, 'అమానవీయంగా' కనిపించే చర్యలపైన విమర్శలు 'బయటి' వాళ్ళు చేయకూడదనీ, వాటిని ఉద్యమకారుల అంతర్గత చర్చలకి మాత్రమే పరిమితం కానివ్వాలనే వైఖరి, ఉద్యమకారుల ఆమోదంతో మాత్రమే వాటిపై విమర్శ చేయాలనీ భావించే వైఖరి అటు ఉద్యమాలకీ ఉపయోగపడదు, ఇటు ప్రజలకీ ఉపయోగపడదు. అమానవీయ అంశాలనీ, చర్యలనీ గుర్తించకుండా, అవి అమానవీయ మైనవని అంగీకరించకుండా, ఉద్యమ ఆచరణలో మానవీయతని నెలకొల్పలేము.

(ప్రతి)హింస అనివార్యత గురించి, (ప్రాణ) నష్టాల గురించి చర్చ రాగానే, మీరు సూచించే ప్రత్యామ్నాయం ఏమిటి అంటూ కొందరు ఎదురుదాడి చేయడం పరిపాటి అయిపోయింది. 'విప్లవవాదులు', 'సంస్కరణవాదులు'గా దిగజారి పోయి ఇలాంటి వాదనలు చేస్తున్నారని ఇలాంటి వాళ్ళు విమర్శిస్తుంటారు. బాలగోపాల్ పైన కూడా వాళ్ళు ఇలాంటి విమర్శలే చేశారు. నిజానికి ఇలాంటి విమర్శనే వాళ్ళమీద కూడా చేయవచ్చు. ఇలాంటి నష్టాలు కొనసాగాలని మీరు కోరుకుంటున్నారా అన్న ఎదురు ప్రశ్న వేయవచ్చు. ప్రత్యామ్నాయ మార్గాలు/విధానాలు/ఎత్తుగడలని గురించి ఆలోచించుకోవాల్సిన బాధ్యత (సంకల్ప పూర్వకంగా) నిర్ణీత పంథాని ఎంచుకున్న సంస్థల మీదనే వుంటుంది. నిర్దిష్టమైన ఘటనలనీ, విధానాలనీ విమర్శించే వాళ్ళమీద ఆ బాధ్యత పెట్టనవసరంలేదు.

బాలగోపాల్ వ్యాసాలు సాయుధ ఉద్యమాల సైద్ధాంతిక అవగాహనతో విభేదించినా, ఆ ఉద్యమాలు తమ ఆచరణని బేరీజు వేసుకో వడానికి ఉపయోగపడతాయి. వాటి ఆచరణపై, నిర్దిష్టమైన వాస్తవాలపై ఆధారపడి ఆయన చేసిన విమర్శలు, సంఘటనలపై పేర్కొన్న వివరాలన్నీ వస్తుగత దృష్టితో ఒక ప్రజాస్వామికవాదిగా, మౌలికంగా ప్రజల కోణం నుంచి చేసినవే.

వర్తమాన పరిస్థితులకి వస్తే, '*నక్సలైట్ ఉద్యమం ఈరోజు ఉన్నంత బలహీనంగా ఎప్పుడూ లేకుండవచ్చు..... వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్య గ్రేహౌండ్స్‌ని ఎలా తిప్పికొట్టాలన్నది కాదు, అంతకంటే పెద్దసమస్యలే ఎదుర్కొంటున్నారు..... సిద్ధాంతరీత్యానూ తీవ్రమైన సమస్యలే వున్నాయి. 20వ శతాబ్దంలో ఒక వెల్లువగా ముందుకొచ్చిన రాడికల్ విప్లవాలు, ఆ శతాబ్దం చివరికి ఆనవాలు లేకుండా పోవడానికి గల కారణాలను హేతుబద్ధంగా విశ్లేషించని కమ్యూనిస్టు పార్టీ ఏదీ కూడా తాను ప్రకటించుకున్న దీర్ఘకాలిక లక్ష్యంవైపు ముందుకు పోతుందనీ, పోగలదనీ నమ్మడం కష్టం*'. (వ్యాసం 33 – నక్సలైట్ ఉద్యమం భవిష్యత్తే కాదు, ప్రజాఉ ద్యమాల భవిష్యత్తు ఏమిటి?) ఇది బాలగోపాల్ ఒక్కడి అభిప్రాయం మాత్రమే కాదు.

మరోవైపు, మావోయిస్టు శిబిరం నుంచే 2011లో వ్యక్తమైన ఒకానొక అభిప్రాయం ఇలా వుంది. 'భారత దేశానికి సంబంధించినంత వరకూ, పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీల కంటే మావోయిస్టు ఉద్యమం విస్తృతంగా వ్యాపించి నప్పటికీ, ఇవాళ, 40 సంవత్సరాల తర్వాత కూడా, దేశంలోని అత్యంత వెనుకబడిన అటవీ ప్రాంతాలకే అది చాలావరకూ పరిమితమై వుంది. నగరాల సంగతటుంచితే, గ్రామీణ మైదానం ప్రాంతాలలో దాని ఉనికి నామ మాత్రంగా వుంది..... ప్రపంచ వ్యాపితంగా పేదరికాన్ని పెంపొందించిన నయా ఉదారవాద విధానాలు రెండు దశాబ్దాల అమలు జరిగి, ధనిక పేద వ్యత్యాసాలని మునుపెన్నడూ చూడనంత స్థాయికి పెంచినా – నిజమైన కమ్యూనిస్టు పునరుద్ధరణ అన్నది జరగలేదు..... కేవలం గడిచిన మూడు దశాబ్దాల కాలంలో మొత్తం సోషలిస్టు సమాజాలు మాత్రమేకాక కమ్యూనిస్టు ఉద్యమాలు సైతం పతనం కావడమన్నది లోతుగా విశ్లేషించాల్సిన విషయం. ప్రస్తుత వ్యవస్థ న్యాయాన్ని అందించలేదనేది సుస్పష్టమే. అయితే మరింత న్యాయమైన, మానవీయమైన నమూనా ఉనికి వుండగలగడమేకాక, అది నిలదొక్కుకోగలగాలి, ఇప్పటి యువతరానికి ఆమోదయోగ్యంగా వుండాల్సి వుంటుంది..... మరింత ముఖ్యంగా, సమాజపు విజ్ఞానశాస్త్రం వైయక్తిక అంశాన్ని నిర్లక్ష్యం చేయకూడదు, చేయలేదు. ఎందుకంటే, సమాజం, మొట్ట మొదటగా, వాళ్ళు వర్గాలుగానూ, కులాలు గానూ లేదా వర్గాలుగానో, కులాలుగానో నిర్మాణం కావడానికి ముందు, అది వ్యక్తులతో కూడివుంటుంది. అత్యధికులకి స్వేచ్ఛ, సంతోషం అందించకుండా, ప్రతీ వ్యక్తిలోనూ మానవీయ అంశం పెంపొందకుండా తెచ్చే ఆర్థిక మార్పులు, ఇతర మార్పులు అసంపూర్ణమైనవి. మావో తన రచనలన్నిటిలో ఇదే అంశాన్ని నొక్కిచెప్పాడు. ఈ దిశలో చాల కృషిచేశాడు. అయితే, మనిషి తన అహంచుట్టూ తిరిగే వైఖరినుంచి, సూటిగా, నిరాడంబరంగా, వినయశీలతతో మెలిగేలా ఎలా మారతాడనే సమాధానం ఇప్పటికి ఇంకా దొరకలేదు. అయితే, న్యాయం, స్వేచ్ఛ, సంతోషం దిశలో మార్పుని నిలబెట్టి కొనసాగించడానికి ఈ సమాధానమే కీలకమైనది'.[8]

సమాధానాల్ని అన్వేషించే క్రమంలో ప్రశ్నలు కీలకమైనవి. ఒక్కొక్కసారి ప్రశ్నలవెనుక ఉద్దేశ్యాలు వున్నాయనిపించవచ్చు. ప్రశ్నల వెనుక విభేదించే సిద్ధాంతాలు/అభిప్రాయాల కోణం వుండవచ్చు. కొన్నిటికి సంతృప్తికరమైన సమాధానాలే లేనట్టనిపించవచ్చు. సమాధానాలు లేని ప్రశ్నల భారం మోయడం కష్టంకాదా, నష్టం చేయదా అనిపించవచ్చు. అయినా తప్పదు. మెరుగైన సమాజంకోసం, ఆదర్శాలు, విలువల కోసం మనుపెన్నటికంటే దృఢంగా నిలబడాల్సిన పరిస్థితులలో ప్రశ్నలే మనకు దారిలో దీపాలు. భయపెట్టే చీకటిలోకి సత్యశీతల ధవళకాంతి ప్రసరించే సెర్చిలైట్లు ప్రశ్నలు. బాలగోపాల్ వ్యాసాల అవసరం అవి లేవనెత్తే ప్రశ్నలలో వుంది. సమాధానాల అన్వేషణ మన చేతుల్లోనే వుంది.

*'అవ్యక్త ఆక్రందనకి వొక గొంతుక గురించి*
*సంకెళ్ళు లేని స్వేచ్ఛకొక దిక్సూచి గురించి*
*గాయపడిన కాలానికి వొక వీలునామా గురించి*
*తిరిగి తిరిగి తలెత్తే ప్రశ్నల గురించి*
*దారులకోసం మనిషి అన్వేషణ గురించి*
*భయం చీకటి ముసిరినచోట*
*సత్యశీతల ధవళకాంతి గురించి*
*ఎప్పటికీ మాట్లాడుకోవాలి.'*

**రిఫరెన్స్:**


1. Memoir of an Indian Communist, K.Damodaran, New Left Review 1/93, September-October 1975
2. Feeding on Dreams, Ariel Dorfman
3. Waking is Another Dream, Poems on the Genocide in Eelam, 2010
4. The Eighteenth Brumaire of Louis Bonaparte. Karl Mar1x 1852
5. Globalisation, Democracy and Terrorism, Eric Hobasbawm, 2007
6. Emancipation and the left: the issue of voilence, Machael Brie, Socialist Register 2009
7. Globalisation, Democracy and Terrorism, Eric Hobasbawm, 2007
8. Judging Marxism by its Fruits, Kobad Gandhy, Economic & Political Weekly, June 25, 2011


ooooooo